క్లుప్తంగా

కాపవరంలో స్థల పరిశీలన



కాపవరంలో స్థల పరిశీలన చేస్తున్న మున్సిపాలిటీ ఈఈ మాధవి

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలో చెత్త నుంచి బయోగ్యాస్ తయారు చేసే యూనిట్లు ఏర్పాటు చేయడానికి రాజమహేంద్రవరం మున్సిపాలిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి సోమవారం స్థల పరిశీలన చేశారు. అనువైన స్థలాలపై ఆరా తీశారు. ఆమెకు తహసీల్దార్ కృష్ణ స్థలాలను చూపించారు. వీఆర్వో వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై గ్రామోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న వేంకటేశ్వరుడు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు హంస వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం సుప్రభాత సేవ, లఘు అర్చన, తోమాలసేవ, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపుసేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం హంస వాహనంపై గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ మెడ్వే సంజీవిని హాస్పిటల్ వైద్య నిపుణురాలు ఎన్.కిన్నెర తెలిపారు. పెదపూడి గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం మెగా ఉచిత వైద్య శిబిరం మెడ్వే సంజీవిని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, ప్రసూతి, అర్థోపెడిక్ తదితర విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఏ.శ్రావణి, పి.అనంతలు సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారికి ఈసీజీ చేశారు. సంతానం లేని వారికి ఐవీఎఫ్‌పై పలు సూచనలు చేశారు. కార్యక్రమ ఆర్గనైజర్ దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యువజన దినోత్సవం

పెదపూడి: స్వామీ వివేకానందుని సాహిత్యం మానవ జీవితానికి దిక్సూచిగా నిలుస్తుందని ఉత్తరకాశీ అద్వైత ఆశ్రమ ప్రతినిధి స్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతీ మహారాజ్ అన్నారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వివేకానందుని బోధనల స్ఫూర్తితో ఆత్మవిశ్వాసమే ఆలంబనగా చేసుకొని యువత విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. స్వామి వివేకనంద సాహిత్యంపై వివేకపథం పేరిట నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు జ్ఞాపికలు, స్వామిజీ సాహిత్యం, ప్రశంసా పత్రాలను అందించారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ మండ రామకృష్ణారెడ్డి, గోదావరి తూర్పుడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

విష వలయం

- సరదా పేరుతో నీచ సంస్కృతి
- పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు
- అరికట్టకపోతే అనర్థాలే

రాజానగరం: సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా విరాజిల్లే రాజమహేంద్రవరం పరిసరాలు ప్రస్తుతం అసాంఘిక, అకృత్య కార్యకాలాపాలతో కలుషితమవుతున్నాయి. ఆధునిక పోకడల పేరుతో కొందరు ముష్కరులు పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, నూతన సంవత్సర సంబరాల పేరుతో సభ్య సమాజం సిగ్గుపడేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మన సంప్రదాయాలను మసకబారేటట్టు చేస్తున్నారు. ప్రశాంతతకు నిలయంగా ఉండే పల్లెటూర్లలో ఆధునికత పేరుతో విష సంస్కృతిని తీసుకువచ్చి, కలుషితం చేస్తున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ గుంటూరుకు చెందిన ఎరువుల కంపెనీ యజమాని తమ వ్యాపారులను పెంపొందించుకునేందుకు ఈ ప్రాంతంలో రేవ్ పార్టీకి శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తుంది.

రేవ్ పార్టీ కలకలం

కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి రేవ్ పార్టీని నిర్వహిస్తూ కొందరు పోలీసులకు చిక్కారనే సమాచారం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. సంక్రాంతి సంబరాలలో నిర్వహించే కోడి పందేలకు కూడా దూరంగా ఉండే ఈ ప్రాంతంలో గోవా, హైదరాబాద్‌లలో మాదిరిగా రేవ్ పార్టీలు నిర్వహించడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు.

వ్యాపారాభివృద్ధి కోసమేనా!

నూతన సంవత్సర వేడుకల పేరుతో డిసెంబరు 31 రాత్రి పలుచోట్ల వివిధ రకాల కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి. కానీ బూరుగుపూడిలో 30వ తేదీ రాత్రే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడం, అందులో కూడా కేవలం 20 మంది కంటే ఎక్కువ లేకుండా ప్లాన్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవలే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో సినీ ప్రముఖులు చిక్కుకున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న గుంటూరు చెందిన ఒక ఎరువుల కంపెనీ యజమాని తమ వ్యాపారాభివృద్ధికి డీలర్లను ఆకట్టుకునేలా ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేశాడనే ప్రచారం జరుగుతుంది. న్యూ ఇయర్ పార్టీలను సరదా కార్యక్రమాలు, పిల్లల డ్యాన్సులు తదితర వాటితో నిర్వహించుకుంటారు. కొందరు మాత్రం మద్యంతో సంబరాలు చేసుకుంటారు. కానీ బూరుగుపూడిలో మద్యంతో పాటు ఆరుగురు అమ్మాయిలను తీసుకువచ్చారు. దీనితో వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



పుణ్యక్షేత్రంలో డ్రగ్స్ పార్టీ జరిగిన ప్రాంతం (ఫైల్)

పుట్టిన వేడుకల్లో డ్రగ్స్ వినియోగం

రాజానగరం మండలం పుణ్యక్షేత్రంలో గత అక్టోబరు 8వ తేదీ రాత్రి జరిగిన ఓ పుట్టినరోజు వేడుకలో డ్రగ్స్ వినియోగం అలజడి సృష్టించింది. ఇక్కడ కూడా పోలీసులు సకాలంలో స్పందించడంతో డ్రగ్స్ తీసుకుంటూ నలుగురు యువకులు పట్టుబడ్డారు. తాడేపల్లిగూడేనికి చెందిన దేవభక్తుని దినేష్‌కు డ్రగ్స్ అలవాటు ఉంది. తనతో పాటే డ్రగ్స్ తాగే మరో స్నేహితుడి ద్వారా ఆన్‌లైన్‌లో వాటిని తెచ్చుకుని పుట్టిన రోజును వెరైటీగా జరుపుకోవాలనుకున్నాడు. ఇందుకు రాజమహేంద్రవరానికి మారుమూలగా ఉండే భూపాలపట్నం నుంచి జి.యర్రంపాలెం వెళ్లే పుంతరోడ్డులోని సిరాజ్ స్టుడియో స్పేస్ గెస్ట్ హౌస్‌ను ఎంచుకున్నాడు. ఆ రోజు రాత్రి బర్త్ డే పార్టీకి వచ్చిన కుటుంబ సభ్యులు, స్నేహితులను ఆతిథ్యం ఇచ్చి పంపించేశాడు. ఆ తర్వాత తనకు అత్యంత సన్నిహితులుగా ఉండే వేమన విక్షం రాధా గగన్ అనే గగన్, బాలం అజయ్, దువ్వనబోయిన పుష్పరాజులతో కలిసి గెస్ట్ హౌస్ ముందు పార్కు చేసిన కారులో కూర్చుని డ్రగ్స్ మత్తును ఎంజాయ్ చేస్తూ పోలీసులకు దొరికిపోయారు.

విష వృక్షం

ఇప్పటికే మన సంస్కృతీ సంప్రదాయాలను కించపరిచేలా కొన్ని తిరునాళ్ల, జాతర్లలో అసాంఘిక నృత్య ప్రదర్శనలు జరుగుతున్నాయి. వీటిని పూర్తి స్థాయిలో అరికట్టక పోవడంతోనే అవి మరింతగా, వివిధ రూపాలలో విస్తరిస్తున్నాయి. వీటిని ఆదిలోనే తుంచేయకపోతే మర్రిచెట్టులా విస్తరిస్తాయి. సంప్రదాయాలను మట్టిలో కలుపుతాయి.

మోటారు సైకిల్ దొంగకు 6 నెలల జైలు

రంగంపేట: మోటారు సైకిల్ దొంగతనం చేసిన కేసులో ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష పడినట్టు ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో ఇజ్జిన సత్య వరప్రసాద్ తన పల్సర్ మోటార్ సైకిల్‌ను ఈ నెల 16వ తేదీన ఎప్పటిలాగే ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. రాత్రి ఉంచిన బైక్ ఉదయం చూసే సరికి కనిపించక పోవడంతో చుట్టు ప్రక్కల వెతికారు. అచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం, తామరపల్లి గ్రామానికి చెందిన రేవు శ్రీనివాస్ వద్ద బైక్ ఉన్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి బైక్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సోమవారం పెద్దాపురం అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.బుల్లెమ్మ ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష విధించినట్టు చెప్పారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ అధికారులు

రాజానగరం: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు సోమవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నివాళులర్పించారు. యూనివర్సిటీలోని ఈసీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు పూలమాల వేసి, అంజలి ఘటించారు. విద్యావేత్తగా, పరిశోధకుడిగా, ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించారని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీపై చర్యలు తీసుకోండి

రాజానగరం: తమ గ్రామంలో బాల్య వివాహాలను నిరోధించడంలో వైఫల్యం చెందిన గ్రామ కమిటీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కొత్తతుంగపాడుకు చెందిన డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ అందించారు. తమ గ్రామంలో ఇకపై ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా చూడాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: కూనవరానికి చెందిన బడుగు గెరటయ్య (34) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. మద్యానికి బానిసైన గెరటయ్య ఈనెల 28 రాత్రి 8.45 గంటలకు పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 29 సాయంత్రం 4 గంటలకు మృతి చెందాడు. అతడి భార్య, ఆరు నెలల కుమారుడు ఉన్నారు. మృతుడి అన్నయ్య ముత్యాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

పెదపూడి: పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నామని ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో విజ్ఞాన ఆవిష్కరణకు ప్రేరణ కల్పించడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో హాజరు కావాలని కోరారు.

ఫొటో స్టూడియోలో చోరీ

రాజానగరం: స్థానిక స్మైల్ ఫొటో స్టూడియోలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. ఇద్దరు అగంతకులు షాపు షట్టర్ తెరిచి, లోపలకు ప్రవేశించారు. రూ.50 వేలు విలువైన రెండు కెమెరాలు, టేబుల్ సొరుగులో దాచిన రూ.55 వేలు అపహరించుకుపోయారు. వీటికి సంబంధించిన దృశ్యాలు స్టూడియోలోని సీసీ కెమెరాలలో వారి వాయిస్‌లతో సహా రికార్డు అయ్యాయి. క్లూస్ టీమ్‌ని రప్పించి ఆధారాలను సేకరిస్తున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై నాగార్జున తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా ఎస్.రవీంద్ర సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన కొవ్వూరు మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వంగలపూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన నవీన్ రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక్క అర్జీ వచ్చింది. రామచంద్రపురంలో ఉన్న భూమి తన అత్తయ్య పూర్వార్జీతంగా వచ్చిందని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేరు మార్చాలని కోరుతూ పురుషోత్తపట్నానికి చెందిన సీహెచ్ నందిని అర్జీ అందించారు. ఈవోపీఆర్డీ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడులపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, కామర్స్ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ అచ్యుత రామకిషోర్ విద్యార్థులకు పెట్టుబడులపై అవగాహన కల్పించారు.

రామకృష్ణ ట్రస్ట్ సేవలు అభినందనీయం



కళ్లద్దాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: కొత్తపల్లి రామకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి శివారు కొత్తూరులో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వాహకులు గత పదేళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందించడం విశేషమన్నారు. శిబిరంలో 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ట్రస్ట్ సభ్యులు కొత్తపల్లి వెంకటేష్, మల్లేశ్వరిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వెంకటరెడ్డి, సత్తి గంగిరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, సత్తిరెడ్డి, వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదస్సు మూడు గంటలు ఆలస్యం



కలవచర్లలో మధ్యాహ్నం 12 గంటలకు కూడా అధికారులు రాక వెలవెలబోతున్న సదస్సు

- కలవచర్లలో ఉదయం 9.30 గంటలకు రెవెన్యూ సభ
- మధ్యాహ్నం 12.30 వచ్చిన అధికారులు
- అప్పటి వరకూ రైతుల నిరీక్షణ



వంగలపూడిలో అర్జీలు అందుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాస్



పందలపాకలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ కృష్ణ

రాజానగరం: మండలంలోని కలవచర్లలో సోమవారం ఉదయం 9.30 గంటలకు రెవెన్యూ సదస్సు ప్రారంభం కావాల్సి ఉంది. సమయానికి అధికారులు రాకపోవడంతో రైతులు ఎదురు చూపులు చూశారు అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తహసీల్దార్ లక్ష్మీలావణ్య వచ్చారు. సదస్సులో నిరీక్షిస్తున్న రైతులు ఆమెకు సమస్యలపై విన్నపాలు అందజేశారు. గత నెలలో జరిగిన సదస్సులో ఈ గ్రామం నుంచి 54 దరఖాస్తులిచ్చామని, వాటిని సంగతి ఏమైందని ప్రశ్నించారు. అవన్నీ పరిశీలనలో ఉన్నాయని తహసీల్దార్ వివరణ ఇవ్వడంతో.. వాటిని పరిష్కరించకుండా ఇప్పుడు కొత్తగా దరఖాస్తులు తీసుకుని ఏం చేస్తారని నిలదీశారు. ప్రయోజనం లేని సదస్సులు నిర్వహించి, రైతులను మోసం చేయడం సరికాదని అదే గ్రామానికి చెందిన రైతు సంఘాల ప్రతినిధులు దాట్ల రఘువర్మ, దాట్ల రవి, దంతులూరి రఘువర్మ, మరికొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు అధికారులు సకాలంలో రాకపోవడంతో చాలామంది రైతులు ఉస్సూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు. మిగిలిన వారి నుంచి 21 దరఖాస్తులు అందాయి.

భూ సమస్యలకు స్వస్తి

బిక్కవోలు: రెవెన్యూ రికార్డుల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యలకు స్వస్తి పలికేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీవీవీఎస్ కృష్ణ తెలిపారు. సోమవారం పందలపాక గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై 11 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

మధురపూడి: రైతాంగ భూమి సమస్యలను పరిష్కరించాలన్న లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. బూరుగుపూడి సచివాలయం వద్ద సోమవారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మాన్యం భూములకు పట్టాలు ఇవ్వాలని మూడు అర్జీలను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామిరెడ్డి, వీఆర్వోలు నక్కా నాగలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

వంగలపూడిలో..

సీతానగరం: వంగలపూడిలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు నాలుగు అర్జీలు అందించారు. ఆదాయపు పన్ను సర్టిఫికెట్ కోసం ఒకటి, భూమి తగాదాలో ఉందని, ఆన్‌లైన్ రికార్డులో డిజిటల్ సైన్ కోసం, సబ్ డివిజన్ కోసం రెండు అర్జీలను రైతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ ఎస్.రవీంద్ర, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో బాబూరావు, ఎండోమెంట్ ఈవో పాటి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 41 మంది ఎంపిక



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 97 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వారిలో 41 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై, ఇంటర్వ్యూలు నిర్వహించారని నిర్వాహకులు హరీష్‌చంద్ర ప్రసాద్, పేరుమాళ్ రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేపీ ఝాన్సీ, కంపెనీల ప్రతినిధులు, హాబ్, సీడ్ అప్ కోఆర్డినేటర్లు గణేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



రామవరంలో ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. సోమవారం రామవరంలో జరిగిన కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు మండల ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల శ్రేయస్సుకి సంఘ సభ్యులు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యులు తమలంపూడి ఈశ్వర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు వెలగల బామిరెడ్డి, ఎస్టీయూ బిక్కవోలు మండల ప్రధాన కార్యదర్శి దార్వంపూడి సురేందర్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు లచ్చిరెడ్డి సత్యనారాయణ, టి సూరిబాబు, పడాల సత్యనారాయణరెడ్డి, గొలగూరి శ్రీనివాస్‌రెడ్డి, సబ్బెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సీరం అప్పారావు పాల్గొన్నారు.

మైనర్ బాలిక అప్పగింత



మైనర్ బాలిక కృష్ణసత్యను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగిస్తున్న అధికారులు

రంగంపేట: బాల్య వివాహం చేసుకున్న మైనర్ బాలికను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్టు అంగన్‌వాడీ సూపర్ వైజర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన లోశెట్టి నాగేశ్వరరావు కుమార్తె లోశెట్టి కృష్ణసత్య (16), దొడ్డ గోవిందు కుమారుడు దొడ్డ మణికంఠ (27)ల వివాహం ఈ నెల 25వ తేదీన రంగంపేట మండలం పి.వీరంపాలెం గ్రామంలో పెద్దల సమక్షంలో జరిగింది. కాగా పెళ్లి కుమార్తె మైనర్ బాలిక అని సమాచారం అందడంతో రంగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సోమవారం మైనర్ బాలిక కృష్ణసత్యను రాజమహేంద్రవరం జిల్లా బాలల సంక్షేమ కమిటీకి అప్పగించినట్టు తెలిపారు.

నాదస్వర విద్వాంసుడు హరి కల్యాణ్‌కు సత్కారం



హైదరాబాద్‌లో యూత్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న హరి కల్యాణ్

పెదపూడి: హైదరాబాద్‌లో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న యూత్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన నాదస్వర విద్వాంసుడు దోమాడ హరికల్యాణ్ యూత్ ఐకాన్ అవార్డు పొందినట్లు సోమవారం తెలిపారు. నాదస్వరంతో దేశభక్తిని చాటినందుకు యూత్ ఐకాన్ అవార్డు అందజేసిందన్నారు. ఈ అవార్డును సినీ నటుడు పృథ్వీరాజ్, హీరోయిన్, డ్యాన్సర్ అక్సాఖాన్, బుల్లితెర నటులు ముంతాజ్ తదితరుల చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్

రాజానగరం: బడిలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు ఒక్కసారిగా తల్లిదండ్రులు, విద్యార్థుల అవతారాలు ఎత్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం ఏవిధంగా ఆరాటపడతారో, ప్రాథమిక విద్యార్థులు బడికి వెళ్లడానికి ఏవిధంగా మారాం చేస్తారో ఆయా పాత్రలలో ఇమిడిపోయి, అందరికీ ఆకట్టుకున్నారు. మండలంలోని కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులలో భాగంగా జరిగిన ఎస్ఆర్ఎం మేళాలో కొంతమంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థుల పాత్రలను పోషించి, అడ్మిషన్ల సమయంలో పాఠశాలలో పరిస్థితులు ఏవిధంగా ఉంటాయో కళ్లకు కట్టినట్టుగా చేసి చూపించి, స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతం చేశారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ జానకీదేవి, కోర్సు కోఆర్డినేటర్ పి. రాంబాబు, ఎంఈఓ సీహెచ్. వి.సోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ అనూష, కేఆర్‌పీలు కె.ఈశ్వరరావు, గౌతమ్ కృష్ణ, డీఆర్పీలు శ్రీనివాస్, శోభన్‌బాబు, భగవానులు తదితరులు పాల్గొన్నారు.

350 గ్రాముల బంగారం, రూ.2 లక్షల చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్

రాజమహేంద్రవరం రూరల్: ఊరు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఇంటిలోని 350 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట రామకృష్ణ నగర్ ప్రాంతానికి చెందిన గరగా అనంతలక్ష్మీదేవి కలెక్టరేట్‌లో కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఈ నెల 26వ తేదీ మధ్యాహ్న సమయంలో కాకినాడలో బంధువులు చనిపోతే ఇంటికి, గేటుకు తాళం వేసి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో తిరిగి వచ్చేసరికి గేటు తాళం వేసినట్టే ఉంది గానీ ఇంటితాళం పగలగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లోని బీరువాలో 350 గ్రాముల బంగారం, రూ.2 లక్షలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ల ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోడ్డు రోలర్

కంబాలచెరువు: నిబంధనలను విరుద్ధంగా మోటారు సైకిళ్లకు ఏర్పాటు చేసిన అధిక శబ్దం గల 502 సైలెన్సర్లను సోమవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిళ్ల సైలెన్సర్లను డిజిటల్ నాయిస్ లెవెల్ మీటర్ ద్వారా తనిఖీ చేశారు. 80 డేసిబుల్స్‌కు మించి శబ్దం కలిగించే 502 వాహనాలను గుర్తించారు. ఎస్పీ సమక్షంలో ఆ సైలెన్సర్లను వాహన దారులతో తీయించి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సైలెన్సర్ల ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందన్నారు. అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను విక్రయించే షాపులు, వాటిని బిగించే మెకానిక్‌లపైనా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నబీ, సూరిబాబు, ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.